

# ఆరోగ్య ప్రదాత

ఆధునిక వైద్యం సామాన్యులకు అందనంత ఎత్తులో ఉన్న ఈ రోజుల్లో నయాపైసా కూడా తీసుకోకుండా అన్ని వైద్యసేవలు అందించే ఆస్పత్రి ఉందంటే ఆశ్చర్యం వేయక మానదు. అది సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రత్యేకత. ఇటీవల పుట్టపర్తిలో జరిగిన అంతర్జాతీయ హృద్రోగ సదస్సుకు విదేశాల నుంచి వచ్చిన ప్రముఖ వైద్యులు ఈ ఆసుపత్రిని సందర్శించారు. వారందరిలో ఒకటే ప్రశ్న. బిల్లింగ్ విభాగం ఎక్కడ అని. ఎంత వెతికినా ఇది కనిపించదు. ఎందుకంటే డబ్బు చెల్లింపు విభాగం లేని ఆసుపత్రి ఇదొక్కటే.

* బాబా తన 30వ ఏటనే పుట్టపర్తి కేంద్రంగా పరిసర గ్రామాల ప్రజలకు వైద్యం అందించేందుకు మొదట ప్రాథమిక ఆసుపత్రిని ప్రారంభించారు. అది 1991 నాటికి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అవతరించింది. ఉచిత వైద్యం అందిస్తూ తన ప్రత్యేకత చాటుకుంది.

* రూ. 300 కోట్లతో నిర్మించిన ఈ ఆసుపత్రిలో 8 ఆపరేషన్ థియేటర్లతోపాటు అత్యాధునిక వైద్య పరికరాలున్నాయి. గుండె, కంటి జబ్బులకు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు.

* ఆసుపత్రిలో ఇప్పటివరకు 22 లక్షల మంది రోగులకు వైద్యసేవలు అందాయి. 12 లక్షల మంది శస్త్రచికిత్సలు చేయించుకున్నారు.

* బెంగళూరులోని సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ సైన్సెస్ పేరిట 306 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నెలకొల్పారు. 2001 జనవరిలో నాటి ప్రధాని వాజపేయి దీనిని ప్రారంభించారు. ఆసుపత్రి నిర్మాణానికి రూ. 500 కోట్లు వెచ్చించారు. గుండె, మెదడుకు సంబంధించి ఇక్కడ చికిత్సలు ఉచితంగా నిర్వహిస్తారు.

* బెంగళూరులోని వైట్‌ఫీల్డులో మహిళలు, పిల్లలకు సేవలందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ప్రస్తుతం దీన్ని 50 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దారు.

* గ్రామీణ ప్రాంత ప్రజల కోసం 2006 మార్చి 30న సంచార వైద్యశాలను బాబా ప్రారంభించారు. 220 మంది వైద్యులు, సిబ్బంది పలు గ్రామాల్లో నిత్యం శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఎక్స్‌రే, ఈసీజీ వంటి పరీక్షలు చేపట్టి, మందులు ఇస్తారు.



## అపర భగీరథుడు



ఫ్లోరైడ్ భూతం నుంచి అనంతపురం జిల్లాను కాపాడేందుకు రూ. కోట్లు ఖర్చు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందించటంలో బాబా సఫలీకృతులయ్యారు. రూ. 500 కోట్లు వెచ్చించి సత్యసాయి పథకం ద్వారా జిల్లాలోని 1447 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారు. 3,200 కిలోమీటర్లకు పైగా పైపులైను వేయించారు. బాబా తన 75వ జన్మదిన కానుకగా అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు, ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఈ పథకాన్ని ప్రజలకు అంకితం చేశారు. 18 బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, 136 గ్రౌండ్ లెవెల్ రిజర్వాయర్లు, 2350 ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించారు. రికార్డు స్థాయిలో 18 నెలల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేశారు. జిల్లాలో దాదాపు సగం గ్రామాలకు సత్యసాయి తాగునీరే ఆధారం. మహబూబ్ నగర్ జిల్లాలో 141 గ్రామాలకు, మెదక్ లో 179, తూర్పుగోదావరిలో 220, పశ్చిమ గోదావరి జిల్లాలో 230 గ్రామాలకు రక్షిత మంచినీరు అందిస్తున్నారు. చెన్నై నగరవాసుల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం చేపట్టిన తెలుగుగంగ, కండలేరు కాలువల నిర్మాణానికి బాబా రూ. 250 కోట్లు అందజేశారు.

## వరద బాధితులకు ఆపన్నహస్తం

బాబా తన సత్యసాయి ట్రస్టు ద్వారా వరద బాధితులకు ఆపన్నహస్తం అందించారు. 2008లో ఒరిస్సాలో భారీ వరదలు రావటంతో పలువురు నిరాశ్రయులయ్యారు. అలాంటి వారికి మేమున్నామంటూ ట్రస్టు చేయూ

తనందించింది. నాలుగు జిల్లాల్లో 750 మందికి పక్కా గృహాలను నిర్మించి ఇచ్చింది. ఒక్కో గృహానికి రూ. 1.30 లక్షలు చొప్పున అందించారు.

* ముంబయి, అహ్మదాబాద్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో వరద బాధితులను ఆదుకున్నారు. హైతీ, గోవా లోని సునామీ బాధితులకు ఆర్థికసాయం అందించారు.

## విద్యతోపాటు మానవతా విలువలు



విద్య అంటే నాలుగు గోడల మధ్య నేర్చుకుని, పుస్తకాలతో కుస్తీపడితే వచ్చేదికాదనేది బాబా సూత్రీకరణ. అందుకే సత్యసాయి విద్యాసంస్థలలో చదివే విద్యార్థులను గ్రామాల్లో జనం మధ్య తిరుగుతూ జీవిత పాఠాలు నేర్చుకోమంటారు. మహోన్నత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు మానవతా విలువలను మేళవించి నాణ్యమైన విద్యా ప్రమాణాలను అందిస్తున్న పుట్టపర్తి సత్యసాయి విశ్వవిద్యాలయం అరుదైన ఘనకీర్తి దక్కించుకుంది. ఇక్కడ ఓనమాల నుంచి డాక్టరేట్ పట్టా వరకు విద్య అందిస్తున్నాయి. ఇదంతా ఉచితమే.

* 1981లో సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ (సత్యసాయి యూనివర్సిటీ)ని ఏర్పాటుచేశారు. ఈ విశ్వవిద్యాలయ పరిధిలో ప్రశాంతి నిలయం క్యాంపస్, అనంతపురంలోని సత్యసాయి మహిళా కళాశాల, బెంగళూరులో బృందావన్ కళాశాల, దేవనహళ్లి సత్యసాయి క్యాంపస్‌లు ఉన్నాయి.

* ఏడు విభాగాల్లో అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) అయిదు విభాగాల్లో పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీ), మూడు ప్రొఫెషనల్ కోర్సులు ఇక్కడ అందిస్తున్నారు.

* క్రమశిక్షణ, అంకితభావం, సంఘసేవ తదితర వాటిల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.
* సత్యసాయి యూనివర్సిటీకి 1986లో ఇండియన్ యూనివర్సిటీ అసోసియేషన్‌లో శాశ్వత సభ్యత్వం లభించింది.
* 2008లో సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ సత్యసాయి యూనివర్సిటీగా అవతరించింది. ఎత్తయిన కొండపై తాజ్‌మహల్‌ను పోలిన అందమైన భవనంలో దీన్ని ఏర్పాటుచేశారు.

## ఏటేటా అన్నవస్త్రాల పంపిణీ




ఆపన్నులను ఆదుకోవాలని, కూడు, గూడు, గుడ్డ లేని నిర్భాగ్యులకు అండగా ఉండేందుకు అన్నవస్త్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. 2000 సంవత్సరం నుంచి విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని వరుసగా పది రోజులపాటు పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెర్వు ప్రాంతాల్లోని దాదాపు వంద గ్రామాల్లో ఇంటింటికీ ఉచితంగా అన్నవస్త్రాలు పంపిణీ చేస్తున్నారు. సంఘసేవను అలవర్చాలనే సంకల్పంతో సత్యసాయి సంస్థల్లోని విద్యార్థులను ఇందులో భాగస్వాములను చేశారు. ఏటా దాదాపు లక్ష మంది కుటుంబీకులకు అన్న వస్త్రాలందిస్తున్నారు.

## దీనజనోద్ధరణ

దారిద్ర్యంతో బతుకు వెళ్లదీయటం గగనమైన ఒక అభాగ్యురాలు... తన ముగ్గురు పిల్లలకు విషమిచ్చి తాను కూడా ఆత్మహత్యకు పాల్పడింది. అయిదేళ్ల కిందట జరిగిన ఈ ఘటన పత్రికలో చూసి బాబా చలించిపో యారు. అదేరోజున అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పిస్తామని ప్రకటించారు. ట్రస్టు ఆధ్వర్యంలో దీనజనోద్ధరణ పథకాన్ని ప్రారంభించారు. పుట్టపర్తిలోనే వసతిగృహంతోపాటు పాఠశాల భవనాన్ని నిర్మించారు. పరిసర మండలాల్లోని దాదాపు 60 మంది నిరాశ్రయులు... అనాథలను చేరదీసి ఇందులో చేర్పించారు. ఒక్కో విద్యార్థి పేరిట రూ. లక్ష డిపాజిట్ చేశారు.